ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 02 సంచిక -308 పేజీలు - 08 వెల - 04/-
బుధవారం 24 సెప్టెంబర్ 2025

# మెడికల్ కాలేజీలపై అసత్య ప్రచారం

## పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు

- ఆ విధానంవల్ల ఎంతో మేలు
- వేగంగామౌలిక వసతుల కల్పన సాధ్యం
- పేదలకు ఉచిత సేవలు.. మరిన్ని మెడికల్ సీట్లు
- రెండేళ్లలోనే ఆసుపత్రుల నిర్మాణం పూర్తి
- ప్రాజెక్టులు పూర్తయ్యాక మళ్లీ ప్రభుత్వం చేతికే
- వాస్తవాలతో పవర్పాయింట్ ప్రజెంటేషన్
-విపక్షం విమర్శలకు దీటుగా జవాబు
- వారి విధానంలో వెళితే 15 ఏళ్లయినా

17 కాలేజీల నిర్మాణం పూర్తికాదని ఎద్దేవా

అమరావతి, సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి
రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలనిర్మాణానికి సంబంధించి అనుసరిస్తున్న పీపీపీ విధానంపై విపక్ష వైసీపీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని, వాస్తవాలేమిటో ప్రజలకు చెబుతున్నామని, వారి విమర్శలను తిప్పికొడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విపక్షం అసత్య ప్రచారాన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో వైద్యారోగ్యంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వైసీపీ విమర్శలను తిప్పికొట్టారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు... పీపీపీవల్లే వేగంగా



# మాటల మంటలు

## తల్లికి వందనంపై మండలిలో వాడీవేడి చర్చ


2లో.

కొందరికే ఇస్తూ..అబద్ధాలుచెబుతున్నారు
సర్కార్ తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స
అందరికీ ఇస్తున్నామని..ఫీజు బకాయిలపై చర్చకు సిద్ధం
మండలిలో విపక్ష సభ్యుల ప్రశ్నలకు లోకేవ్ సమాధానం
హోంమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా వైకాపా వాకౌట్

తల్లికి వందనం పథకంపై వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి నారా లోకేష్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం శాసనమండలి సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా తల్లికి వందనం లబ్ధిదారులు ఎంతమంది అంటూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.


2లో.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం

# మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా ఇవ్వాలి

కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది
మేడారం చేసుకున్న పాపమేంది
కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్
మేడారం సందర్శన..అభివృద్ధిపై సమీక్ష
జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు
గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు
నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్

2లో.



# లోకేశ్ తీర్మానానికి వైసీపీ మద్దతు




విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు
శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేశ్
ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ఇస్తామని బొత్స వెల్లడి

అమరావతి, సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మంగళవారం అత్యంత వాడివేడిగా, నాటకీయ పరిణామాల మధ్య సాగాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానం సభలో సంచలనం సృష్టించగా, ప్రతిపక్ష వైసీపీని ఇరకాటంలో పడేసింది. అనూహ్యంగా, ఆ తీర్మానానికి వైసీపీ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. మిగతా 2లో...

## పిసి ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

హైకోర్టులో సవాల్ చేసిన ఐఎఎస్ స్మితా సబర్వాల్

హైదరాబాద్, సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతరమిగతా 2లో...



## 2026 మార్చి 31 వరకు పాత ఎమ్మార్పీతో అమ్మకాలకు అనుమతి

పాత ఎమ్మార్పీ వస్తువులపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..
ఏపీలో జీఎస్టీ తగ్గింపుతో మారిన ఎమ్మార్పీ ధరలు
పాత స్టాక్ విక్రయాలపై ప్రభుత్వం కీలక సడలింపులు
జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు చేరాలన్న మంత్రి నాదెండ్ల మనోహర్
అధిక ధరలకు అమ్మితే 1967కు ఫిర్యాదు చేసే అవకాశం

అమరావతి, సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి
ఏపీలో జీఎస్టీ రేట్లు తగ్గడంతో ఇప్పటికే ప్యాక్ చేసి ఉన్న పాత సరుకుల విక్రయంపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. మిగతా 2లో...



# జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న మోహన్‌లాల్
ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మస్సే, ఉత్తమ నటిగా రాణి ముఖర్జీలకు అవార్డుల ప్రదానం

ఢిల్లీ సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి
71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. అవార్డుల విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరయ్యారు. ఈ వేడుకలో మలయాళం సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. అలాగే ఉత్తమ నటుడి అవార్డును షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12 ఫెయిల్), మిగతా 2,7లో...



# ప్రజల సొమ్ముతో పండుగ కానుకలు వద్దు..

కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఆదేశాలు -దీపావళి సందర్భంగా ఆర్థిక శాఖ నిర్ణయం
మంత్రిత్వ శాఖలకు తాజాగా ఆదేశాల జారీ -ఆర్థిక క్రమశిక్షణ కోసమే నిర్ణయమని వెల్లడి

ఢిల్లీ సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి:దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఉత్తర్వులు వెలువరించింది. పండుగ సంతోషాన్ని పంచుకునేందుకు ప్రజల సొమ్ము వెచ్చించవద్దని ఆదేశించింది. ఇతర పండుగల సమయాల్లోనూ కానుకల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయొద్దని మంత్రిత్వ శాఖలకు స్పష్టం చేసింది. ఆర్థిక క్రమశిక్షణకు, అనవసర వ్యయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొంది. ప్రజావనరులను మరింత సమర్థవంతంగా వినియోగించేలా ప్రభుత్వ విభాగాలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ నోటీసులు పంపింది. ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, అనవసర ఖర్చులను నియంత్రించడంపై ఆర్థిక శాఖ వ్యయ విభాగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే దీపావళి సహా ఇతర పండగలకు బహుమతుల కోసం మంత్రిత్వ శాఖలు ఎలాంటి ఖర్చు చేయరాదని నోటీసుల్లో పేర్కొంది.



# మెడికల్ కాలేజీలపై అసత్య ప్రచారం

(మొదటి పేజి తరువాయి)

మరో 15 ఏళ్లు పడుతుంది" అని ధాటిగా ఎండగట్టారు. అసెంబ్లీ వేదికగా చంద్రబాబు నాయుడు సమర్పించిన వివరాలు ఒకవైపు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేస్తే, మరోవైపు పీపీపీ విధానంపై వస్తున్న అపోహలను నివృత్తి చేశాయి. కన్వీనర్ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంగళవారం ఓ అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఒక్క సరదా వ్యాఖ్యతో సభ నవ్వులతో నిండిపోయింది. వైద్యారోగ్య శాఖపై జరుగుతున్న చర్చలో ఆయన చేసిన చమత్కారానికి డిప్యూటీ స్పీకర్‌తో సహా సభ్యులందరూ పగలబడి నవ్వారు.

వైద్యారోగ్య శాఖపై చర్చకు సమాధానమిస్తూ సీఎం చంద్రబాబు ప్రజల ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతున్నారు. "మనిషి ఆయుర్దాయం 120 ఏళ్లు.. కానీ మనం 40 ఏళ్లకే 120 ఏళ్లకు సరిపడా ఆహారాన్ని తినేస్తున్నాం" అని చెబుతూ, ఒక్కసారిగా సభను అధ్యక్ష స్థానం నుంచి నడిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వైపు చూశారు. నవ్వుతూ.. "అధ్యక్షా, ఇది మీకు కూడా వర్తిస్తుంది!" అనడంతో సభలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. ఈ అనూహ్యమైన వ్యాఖ్యకు డిప్యూటీ స్పీకర్ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు.

గతంలో కొందరు పోలీసులు పొట్టలు పెంచుకోవడం చూసి, తగ్గించుకోమని వాళ్లకు స్పష్టం చేశానని చంద్రబాబు వెల్లడించారు. అంతేకాదు, తన వైద్యులు కూడా ఇలాగే కనిపించారని... దాంతో, "డాక్టర్లే పేషెంట్లయితే ఎలా? డాక్టరుగా నువ్వు నాకు ట్రీట్‌మెంట్ ఇవ్వడం కాదు, ముందు నీకు నువ్వు ట్రీట్‌మెంట్ ఇచ్చుకో." అని చెప్పేవాడ్నని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ సరదా సంభాషణ అనంతరం చంద్రబాబు ఆరోగ్య పరిరక్షణపై కీలక ప్రసంగం చేశారు. "ఆహారమే ఔషధం, మన వంటగదే ఓ ఫార్మసీ" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. అనారోగ్యాలకు అతిగా తినడమే ప్రధాన కారణమని, తాను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడూ సెలవులు తీసుకోకపోవడానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలే కారణమని తెలిపారు. ప్రజలు తమ జీవనవిధానంలో మార్పులు చేసుకోవాలని, ఉప్పు, పంచదార, నూనె వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. రోజుకు 8 గంటల ప్రశాంతమైన నిద్ర అవసరమని నొక్కిచెప్పారు.

రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసి, ఒక్కొక్కరికీ 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డును సిద్ధం చేస్తామని ప్రకటించారు. దీనితో పాటు రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి రూ. 2.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చుల కంటే గదుల అద్దెలే భారంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# మండలిలో మాటల మంటలు

**అమరావతి సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి** తల్లికి వందనం పథకంపై వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి నారా లోకేష్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం శాసనమండలి సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా తల్లికి వందనం లబ్ధిదారులు ఎంతమంది అంటూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమ్మఒడి రాలేదు తల్లికి వందనం వస్తోందంటూ వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పేరిట కొందరికే పథకాన్ని పరిమితం చేశారని విమర్శించారు. తల్లికి వందనం కింద కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15వేలు ఇస్తోందని లోకేశ్ వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లకు తల్లికి వందనం వర్తించట్లేదని మండలి చైర్మన్ అడిగారు. అందరికీ వర్తించేలా జీవో లేదా మెమో ఉందా అని మంత్రిని ప్రశ్నించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తించేలా జీవో ఉందంటూ జీవోలోని అంశాన్ని ఛైర్మన్‌కు చదివి వినించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తమకూ వర్తింపచేయాలనే వినతి ప్రభుత్వ పరిశీలనలో ఉందని.. చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంత్రిగా అన్ని అంశాలు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వైకాపా హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందిగాక.. మాపై విమర్శలా? అని వైకాపా సభ్యులను లోకేశ్ నిలదీశారు. గత ప్రభుత్వ పాలనలో ఏ ఏడాది ఎంత బకాయి పెట్టారో అందరికీ తెలుసన్నారు. సభలో తాను పరుష వ్యాఖ్యలు చేసినట్లు- బొత్స చేసిన విమర్శలు అవాస్తవమన్నారు. అలా తాను ఏం మాట్లాడానో చెప్పాలన్నారు. బొత్స సీనియార్టీని గౌరవిస్తానని.. తప్పుడు ప్రచారం చేయొద్దని లోకేశ్ హితవు పలికారు. శాసనసభ సమావేశాలకు దూరంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ... శాసన మండలిలో మాత్రం ప్రభుత్వాన్ని నిలదీస్తోంది.. దీంతో, మండలిలో కూటమి వర్సెస్ వైసీపీగా మారింది పరిస్థితి.. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం అన్నారు.. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. సమాజంలో మార్పు రావాలంటే నైతిక విలువలు పెంపొందాలి అన్నారు.. ప్రభుత్వం చాగంటి కోటేశ్వరరావు సలహాదారుగా పెట్టుకున్నాం.. ఆయన రాసిన పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందిస్తున్నాం.. ఆయన ఒక్క రూపాయి జీతం, ఇతర సౌకర్యాలు ఏమీ తీసుకోకుండా పనిచేస్తున్నారని వెల్లడించారు.. ఎస్సీ, బీసీ విద్యార్థులకు విడిగా క్లాసులు పెట్టామన్న సమాచారం ఉంటే ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం అన్నారు మంత్రి లోకేష్.. అయితే, సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలకు పొంతన లేదని విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు.. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రశ్న అడిగాం.. ఫీజుల నియంత్రణ కోసం కమిటీ- వేస్తున్నామా? లేదా? అని అడిగాం.. ఆర్టీఈ యాక్ట్ గురించి తీసుకున్న చర్యలేంటి అని ప్రశ్నించారు బొత్స.. అయితే, నేను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. ప్రభుత్వం 50 వేల మంది పిల్లలకు ఆర్టీఈ ప్రకారం విద్యను అందించాం అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.. శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై వైఎస్సార్‌సీపీ చర్చకు పట్టుబట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మంత్రి నారా లోకేష్ అబద్ధపు వ్యాఖ్యలను ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. మేం బకాయి పెట్టినట్లు- లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు అవాస్తవం అని బొత్స మండిపడ్డారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్‌కు మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణల మధ్య వాగ్వివాదం జరిగింది. సభలో సీనియర్, జూనియర్ అనే తేడాలు ఉండవు. ఎవరైనా సభా మర్యాదలు పాటించాలి. కొన్ని పరుష పదాలు వాడకూడదు.. కొన్ని నేర్చుకోండి. మంత్రి లోకేష్ చెప్పినట్లుగా మేం బకాయిలు పెట్టామన్నది అవాస్తవం. చర్చకు రండి మేము సిద్ధంగా ఉన్నాం. సభను తప్పుదోవ పట్టించి ప్రజలు మధ్య పెడితే కుదరదని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో అవుట్ సోర్సింగ్ వర్కర్లకు పథకం అమలు అయ్యింది.. వారికి ఇప్పుడు నిలిపివేశారు.. వారికి అమలు చేసే అవకాశం ఉందా? అంటూ మండలి ఛైర్మన్ మోషేన్ రాజు.. మంత్రి లోకేష్‌ను అడిగారు మున్సిపాలిటీల్లో పనిచేసే వర్కర్స్ జీతాలు 12 వేలు.. రూరల్ ప్రాంతంలో 10 వేల కంటే తక్కువ ఉన్నవారికి పథకం వర్తిస్తుందని మంత్రి లోకేష్. సమాధానమిచ్చారు. మున్సిపాలిటీలో 18 వేలు వేతనం ఉంది.. మీరు 12 వేలు నిబంధన పెడితే పథకం ఏ విధంగా వాళ్లకు అందుతుందంటూ మండలి ఛైర్మన్ ప్రశ్నించారు. దీంతో పరిశీలిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. తల్లికి వందనంపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, బొమ్మి ఇజ్రాయేలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థుల కోసం అమ్మఒడి కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వం దాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం అని పేరు పెట్టారు. 67 లక్షల మందికి విద్యార్థులకు పథకం ఇస్తామని 54 లక్షల మందికి మాత్రమే ఇచ్చారు. మొదటి ఏడాది ఎగ్గొట్టారు.. రెండో ఏడాది అరకొరగా ఇచ్చారు. నిబంధనల పేరుతో అనర్హుల సంఖ్యను పెంచారు. కరెంట్ బిల్లు 300 దాటినా పథకం కట్ చేశారని అన్నారు. ఇకపోతే శాసన మండలి నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. హోంమంత్రి అనిత వ్యాఖ్యలకు నిరసనగా వాకౌట్ చేశారు. హోంమంత్రి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు.

# మేడారం జాతరకు జాతీయ పండుగ హెూదా ఇవ్వాలి

**ములుగు సెప్టెంబర్, 23, ఆంధ్ర ప్రగతి**

ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు- తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క - సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టు-కునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు- స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు- చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్ని-కై-నప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం అని స్పష్టం చేశారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అదే సమయంలో, కేంద్రంపై విరుచుకుపడిన సీఎం రేవంత్ రెడ్డి, కుంభమేళాకు వేలకోట్లు- ఇస్తున్న కేంద్రం, ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. మహాజాతర సమయంలో తిరిగి వచ్చి, ఈ జాతరను మరింత ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు.చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ పూజారులను సత్కరించారు. అలాగే ఆయన నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు.

# జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజి తరువాయి)

ఉత్తమ నటి అవార్డును రాణి ముఖర్జీలకు (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ "దాదా ఫాల్కే పురస్కారాన్ని నేను అందుకుంటానని నేను కలలో కూడా ఊహించలేదు. ఇదంతా మ్యాజిక్‌లా అనిపిస్తోంది. ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ పురస్కారం నా ఒక్కడికే కాదు మలయాళ చిత్ర పరిశ్రమకు చెందుతుంది"అని అన్నారు.ఈ వేడుకలో టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా 'భగవంత్ కేసరి' ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పురస్కారాలు స్వీకరించారు. సాయి రాజేష్ (ఉత్తమ స్క్రీన్ ప్లే %-% బేబీ సినిమా), పివిఎస్ రోహిత్ (ఉత్తమ నేపథ్య గాయకుడు %-% బేబీ సినిమా), ప్రశాంత్ వర్మ (బెస్ట్ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్ %-% హనుమాన్ సినిమా), హర్షవర్ధన్ రామేశ్వర్ (ఉత్తమ నేపథ్య సంగీతం %-% యానిమల్ మూవీ), సుకృతి వేణి(ఉత్తమ బాల నటి %-% గాంధీ తాత చెట్టు) అవార్డులు అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన బలగం సినిమాలోని 'ఊరు పల్లెటూరు' అనే పాటకు ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ జాతీయ అవార్డు అందుకున్నారు. హనుమాన్ సినిమాకు గాను బెస్ట్ యాక్షన్ విభాగంలో స్టంట్ కొరియోగ్రాఫర్లు నందు, పృథ్వీ జాతీయ పురస్కారాలు స్వీకరించారు. అదేవిధంగా వివిధ విభాగాలలో విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను అందజేశారు.

# లోకేశ్ తీర్మానానికి వైసీపీ మద్దతు

**విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు**

**శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేశ్**

**ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ఇస్తామని బొత్స వెల్లడి**

(మొదటి పేజి తరువాయి)

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మంగళవారం అత్యంత వాడివేడిగా, నాటకీయ పరిణామాల మధ్య సాగాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానం సభలో సంచలనం సృష్టించగా, ప్రతిపక్ష వైసీపీని ఇరకాటంలో పడేసింది. అనూహ్యంగా, ఆ తీర్మానానికి వైసీపీ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విజయవంతంగా అడ్డుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి అభినందనలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు సమర్పిస్తూ మంత్రి నారా లోకేశ్ మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి, రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఐక్యతను చాటాలని ఆయన కోరారు.అయితే, ఈ సమయంలో జోక్యం చేసుకున్న వైసీపీ సభ్యులు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా కేంద్రం ఇంకా అడుగులు వేస్తోందంటూ తీర్మానాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మేం వందసార్లు చెప్పాం. అయినా మీకు స్పష్టత లేదా? ప్రైవేటీకరణ ఆగిపోయిందని మీరే చెబుతూ, మళ్లీ మీరే సభను తప్పుదోవ పట్టిస్తారా?" అని నిలదీశారు.గత ఐదేళ్ల వైసీపీ పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ లోకేశ్ విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని దాదాపు 80 శాతానికి తీసుకువచ్చాం. మీ హయాంలో అది 48 శాతానికి పడిపోయింది. రూ.25 వేల కోట్ల అప్పులు మిగిల్చారు. అలాంటి మీరు మాట్లాడతారా? మేం సొంత కేసుల కోసం ఢిల్లీ వెళ్లడం లేదు. దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయేకు బేషరతుగా మద్దతు ఇస్తున్నాం. కేంద్రంతో గొడవలు పెట్టుకోం, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. తాను ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నారా, లేదా వ్యతిరేకిస్తున్నారా? అని వైసీపీని సూటిగా ప్రశ్నించారు.

**దిగివచ్చిన వైసీపీ.. బొత్స మద్దతు**

మంత్రి లోకేష్ ప్రశ్నతో ఇరకాటంలో పడిన వైసీపీ, చివరకు ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఎవరు ప్రయత్నించినా మా సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటాయి" అని తెలిపారు. అయితే, మరోవైపు వైసీపీ సొంతంగా ఓ తీర్మానాన్ని సభ ముందుకు తీసుకురాగా, దానిని అధికార పక్షం అసందర్భంగా అభివర్ణించింది. "మేం ఇప్పటికే స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. ఆరు నెలల కిందట రాసుకున్న డ్రాఫ్ట్‌ను ఇప్పుడు తీసుకువచ్చి ప్రయోజనం ఏంటి?" అని లోకేశ్ ఎద్దేవా చేశారు.

# పిసి ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు- సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీ-వల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు- అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలోని పలు ప్రాంతాలను విద్యుద్దీపాల అలంకరణలతో కళ్లుమిరిమిట్లు- గొలిపేలా తీర్చిదిద్దారు. పూల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను నేరుగా తిలకించేందుకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు.

# 2026 మార్చి 31 వరకు పాత ఎమ్మార్పీతో అమ్మకాలకు అనుమతి

వ్యాపారులకు నష్టం జరగకుండా, అదే సమయంలో వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందేలా కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పాత ఎమ్మార్పీ ధరలతో ఉన్న నిల్వలను 2026 మార్చి 31 వరకు అమ్ముకునేందుకు అనుమతినిస్తున్నట్లు స్పష్టం చేసింది.ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలు కచ్చితంగా ప్రజలకు చేరాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీకి ముందు తయారైన లేదా ప్యాక్ చేసిన వస్తువులపై కొత్త ఎమ్మార్పీ స్టిక్కర్ వేయాల్సిన అవసరం లేదని, అయితే పాత ఎమ్మార్పీ స్టిక్కర్‌ను తొలగించకూడదని ఆయన స్పష్టం చేశారు. కంపెనీలు లేదా డీలర్లు వస్తువుల ధరలు తగ్గిన విషయాన్ని వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.వినియోగదారుల వ్యవహారాల శాఖ జారీ చేసిన ప్రకటన ప్రకారం, తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులు తమ ఉత్పత్తుల కొత్త ధరల వివరాలను డీలర్లకు తెలియజేయాలి. ఈ సమాచారానికి సంబంధించిన కాపీలను రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ డైరెక్టర్, కంట్రోలర్‌కు కూడా పంపాల్సి ఉంటుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ఈ ధరల మార్పుపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 24 సెప్టెంబర్ 2025

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.

## గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ.

**-నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన.**

**-అక్టోబర్ 5వరకు నిరసన కార్యక్రమాలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నంద్యాల జిల్లా ప్రభుత్వాన్ని కోరింది.మంగళవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావడం జరిగింది. అదేవిధంగా భోజన విరామ సమయంలో సచివాలయాల వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు.అనంతరం మునిసిపల్ కమిషనర్ గారికి సమస్యలతో కూడిన వినతిపత్రం మరియు నిరసన కార్యక్రమాల నోటీస్ అందజేయడం జరిగింది. అనంతరం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఎం.గురుస్వామి,రామకృష్ణ,ఈశ్వరయ్య,మధుసూదన్ రెడ్డి,సంపత్ కుమార్, యజ్ఞేస్, పద్మావతి,ప్రభావతి మల్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 1.25 లక్షల మంది గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ కు సమర్పించిన నోటీసు ఇచ్చి 15 రోజుల గడువు పూర్తి కావడంతో రాష్ట్ర జెఏసి నేటి నుండి నిరసన కార్యక్రమాల పిలుపునిచ్చిందని అందులో భాగంగా నేడు జిల్లావ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గ్రామ



వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చొరవతో చూపిస్తుందేమో ఎదురుచూస్తున్నప్పటికి సమస్యలను పరిస్కారంలో చొరవ చూపకపోగా సర్వేల పేరుతో మరింత పనిభారం పెంచి సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని భంగం కలిగించే విధంగా చేస్తుందనీ తెలియ జేశారు.

# ఉయ్యాలవాడ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జెసి సి.విష్ణు చరణ్.

**పిజిఆర్ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి.**

**అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంటు ఇవ్వాలి.**

**జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్.**



**ఆంధ్ర ప్రగతి ఉయ్యాలవాడ, సెప్టెంబర్ 23:** నంద్యాల జిల్లా, ఉయ్యాలవాడ తాసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని వీఆర్వోలకు సూచించారు.

అర్జీ దారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారికి అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంటు క్లియర్ గా ఇవ్వాలన్నారు. ఉయ్యాలవాడ మండలంలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని భూ సమస్యల పరిష్కారానికి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ పిజిఆర్ఎస్ అర్జీలను ఎలా క్లియర్ చేస్తున్నారు, అర్జీదారునికి ఎండార్స్మెంట్ ఎలా ఇస్తున్నారు, తదితర వివరాలను వీఆర్వోలకు సూచించారు. ఈ సందర్భంగా పలు రెవిన్యూ అంశాలకు సంబంధించి తహసిల్దార్, విఆర్వోలకు దిశ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఆర్ ఐ, విఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# మస్జీద్ ఏ ఖాన్ ఖా -బస్ స్టాండ్ నూతన కమిటీ సభ్యులను సన్మానించిన ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** నంద్యాల పట్టణంలో ఆర్టీసీ బస్సు స్టాండ్ ఎదురుగా ఉన్న మస్జీద్ ఏ ఖాన్ ఖా లో ఇటీవల ఎన్నికైన నూతన మస్జీద్ కమిటీ సభ్యులను టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ, మస్జీద్ అభివృద్ధి, పరిశుభ్రత, ముస్లిం సోదరులకు వసతుల కల్పన తదితర కార్యక్రమాలను నూతన కమిటీ సమర్థవంతంగా నిర్వహిస్తూ మస్జీద్ ద్వారా ముస్లిం సమాజానికి మంచి సేవలందించాలని ఆకాంక్షించారుఅదే విధంగా ముస్లిం సంక్షేమం కొరకు మంత్రి ఫరూక్ తో పాటు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎన్ఎండి ఫిరోజ్ భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, ఖాన్ ఖా మస్జీద్ కమిటీ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులు మహ్మద్ ఇసాక్, అప్సర్ భాష, కార్యదర్శి ఇస్మాయిల్ అలీ,జాయింట్ కార్యదర్శి హీదాయతుల్లా కోశాధికారి జాకీర్ హుస్సేన్, కమిటీ సభ్యులు షబ్బీర్, ఖుర్షిద్,మహ్మద్ రఫీ,ఇబ్రహీం, అబ్దుల్ గఫ్ఫార్ తదితరులు మరియు మస్జీద్ ఇమామ్ ముఫ్తి అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**ఇటీవల "డిజిటల్ అరెస్ట్" అనే పేరుతో సైబర్ మోసాలు ఎక్కువ అవుతున్నాయి... జాగ్రత్త.**

**సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీకి అవకాశం గంటలోపే. - అప్రమత్తతే కీలకం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ సెప్టెంబర్ 23:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్ళు పోలీసులమని, సీబీఐ అధికారులమని లేదా ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేస్తూ మీ మీద కేసు నమోదైందని, గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్నారని, మీరు అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్నారని, మీ పేరు మీద కోరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయని లేదా మీ సిమ్/బ్యాంక్ ఖాతా కు వాడబడిందని వచ్చే కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ విజ్ఞప్తి చేశారు.పోలీసులు ఎప్పుడూ వీడియో, ఆడియో కాల్స్ చేయరన్న విషయం గ్రహించాలన్నారు.ఎవరికీ కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టు గురించి సమాచారం చెప్పడం పోలీసుల పని కాదన్నారు. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీకి అవకాశం గంటలోపే... అప్రమత్తతే కీలకం. సైబర్ నేరాల లో ముఖ్యంగా లోన్ యాప్ మోసాలు చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి, పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఉద్యోగ మోసాలు అధిక జీతాలు వాగ్దానం చేసి, రిజిస్ట్రేషన్ లేదా ట్రైనింగ్ పేరుతో డబ్బులు దోచుకుంటున్నారు.



ఆన్లైన్ షాపింగ్ మోసాలు ఆకర్షణీయ ఆఫర్లు చూపించి వస్తువులు పంపకుండా మోసం చేస్తున్నారు.

ఇన్వెస్ట్మెంట్ మోసాలు క్రిప్టో, షేర్లు, ట్రేడింగ్ పేరుతో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి మోసం చేస్తున్నారు. ఫేక్ ఈ-కామర్స్ / ఓఎల్ఎక్స్ మోసాలు %-% నకిలీ కొనుగోలు/అమ్మకాలు చేస్తూ క్యూఆర్ కోడ్, తప్పుడు చెల్లింపుల ద్వారా డబ్బు పోగొడతారు.రోమాన్స్ / డేటింగ్ మోసాలు %-% సోషల్ మీడియా ద్వారా నమ్మకం కలిగించి తరువాత అత్యవసరాల పేరుతో డబ్బు అడుగుతారు.

సోషల్ మీడియా మోసాలు నకిలీ ప్రొఫైళ్లతో బంధువులు, స్నేహితుల పేరుతో డబ్బులు అడుగుతున్నారు.

ఓటిపి, కేవైసీ మోసాలు ద్వారా బ్యాంక్ వివరాలు, వన్ టైమ్ పాస్వర్డ్ తీసుకొని ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు కాల్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తె అటువంటి ఫోన్ నెంబర్లను బ్లాక్ చేసి ఆ సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో గాని లేదా డయల్ 100 ద్వారా గానీ సమాచారం అందించాలన్నారు.

ప్రజలు ఎవరితోనూ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం, ఓటిపి పంచుకోవద్దని ఎస్పీ గారు సూచించారు. ఎలాంటి సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 నంబర్కి కాల్ చేయాలని లేదా **www.cybercrime.gov.in**

వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సైబర్ నేరం జరిగిన గంటలోపే ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొమ్మునంతా తిరిగి రికవరీ చేసి ఇప్పించేందుకు పోలీసులకు అవకాశం ఉంటుందని, గంటలోపే అప్రమత్తతే కీలకమని అది "గోల్డెన్ అవర్" అని జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చిన్నతనం నుంచి శిఖరాల వరకు.. మోదీ జీవితం ప్రతి విద్యార్థికి ప్రేరణ.

**శ్రమిస్తే శిఖరాగ్రాలే లక్ష్యం. - బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు.**










**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భాజపా ఆధ్వర్యంలో జరుగుతున్న సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం బొమ్మలసత్రం ఎస్.పీ.వై. రెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు "మోదీ బాల్యం కష్టాలు సాధించిన విజయాలు" అనే డాక్యుమెంటరీ ప్రదర్శించారు.నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ.."మోదీ గారు ఒక సాధారణ కుటుంబంలో పుట్టి చిన్నతనంలో టీ అమ్ముతూ జీవన పోరాటం ప్రారంభించారు. కష్టాలు, ప్రతికూలతలు ఎంత ఎదురైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగారు. శ్రమ, క్రమశిక్షణ, దృఢసంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తన జీవితంతోనే నిరూపించారు. ఆయన బాల్యం నుండి ప్రధాని స్థాయికి ఎదగడం ప్రతి విద్యార్థికి ప్రేరణ కావాలి. మీరు కూడా మోదీ గారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలోని ప్రతి రంగంలోనూ కష్టపడి ముందుకు సాగితే గొప్ప స్థానాలు దక్కించుకోవచ్చు" అని తెలిపారు.అభిరుచి మధు ఇంకా మాట్లాడుతూ..మోదీ విజయగాథ మనకు ఒక పాఠం. ఎవరూ పుట్టుకతో గొప్పవారు కాలేరు. శ్రమిస్తేనే శిఖరాలను అధిరోహించవచ్చు. చదువులోనూ, ఉద్యోగాల్లోనూ, వ్యాపారాల్లోనూ, సామాజిక సేవలోనూ మిమ్మల్ని మీరు నిరూపించండి. విజయానికి రహస్యమైది పట్టుదల. మోదీ ని ఒక రోల్ మోడల్గా తీసుకొని ముందుకు సాగండి" అని విద్యార్థులను ప్రేరేపించారు.కార్యక్రమంలో నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్ర రెడ్డి, లక్ష్మీ రెడ్డి,బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎన్ డి ఫర్నిచర్ షాప్ ను ప్రారంభించిన ఎన్ ఎండి ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** నంద్యాల పద్మావతి నగర్ లో నాయుడు కుండా బీర్యాని ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎండి ఫర్నిచర్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ హాజరై తన చేతులా మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్బంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ఎక్కడ తగ్గకుండా అత్యాధునిక ఫర్నిచర్ పరికరాలతో నంద్యాల ప్రజలకు నాణ్యమైన ఫర్నిచర్ అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. నంద్యాల ప్రజలు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఉద్యాన పంటలపై పరిశీలన

## - రైతులకు కలెక్టర్ సూచనలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



బేతంచెర్ల మండలం ఎంబాయ్ గ్రామంలోని ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



బేతంచెర్ల మండలం లోని ఎంబాయ్ గ్రామంలోని దానిమ్మ తోట లో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



బేతంచర్ల మండలం ఎంబాయ్ గ్రామంలోని టమోటా రైతులతో పంట వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్



బేతంచెర్ల మండలం సీతారామపురం గ్రామంలోని ఎన్ ఆర్ జి ఎస్ రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



బేతంచెర్ల మండలం సీతారామపురం గ్రామంలో అంజీర్ పండ్ల తోట రైతులతో పంట వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

**ఆంధ్ర ప్రగతి బేతంచర్ల/నంద్యాల, సెప్టెంబరు 23:**
బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామపురం గ్రామాలను సందర్శించి ఉద్యాన పంటల పరిస్థితిని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉల్లి వ్యాపారులు, రైతులతో ముఖాముఖి జరిపి పంటల దిగుబడి, ఆదాయం, లాభనష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా లభించే నాటు రకాలకే పరిమితం కాకుండా అధిక దిగుబడి ఇచ్చే వినూత్న రకాలను సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను వాడుకోవాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువుల వినియోగం పెరగడం వల్ల దిగుబడి మెరుగుపడి రైతులకు మంచి ఆదాయం వస్తుందని వివరించారు. రైతులు ఉల్లిపంటకు ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.650 నుండి రూ.700 మాత్రమే ఉన్నందున గిట్టుబాటు ధర లభించడం లేదని కలెక్టర్‌కు నివేదించారు. రైతు ప్రభాకర్ రెడ్డి మల్చింగ్ పద్ధతిలో సాగుచేసిన దానిమ్మ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ విధానం వల్ల రసాయనాలు, చీడపీడల బెడద తగ్గుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అధిక ఆదాయం ఇచ్చే పంటల వైపు దృష్టి సారించాలని, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎంబాయి గ్రామంలో అరటి, మామిడి పంటలు అధికంగా సాగుతున్నాయని రైతులు వివరించగా, మామిడి పంట ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు ఫ్రూట్ కేర్ యాక్టివిటీ కింద మామిడి, దానిమ్మలకు సదుపాయాలు కల్పించాలని కోరగా, ఈ సంవత్సరం నుంచే అమలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదే గ్రామంలో రైతు మహబూబ్ బాషా 40 సెంట్ల భూమిలో ట్రెల్లిసింగ్ పద్ధతిలో సాగుచేసిన టమోటా పంటను కలెక్టర్ పరిశీలించారు. గత సంవత్సరం నాలుగు కోతల ద్వారా దిగుబడి సాధించి అధిక లాభాలు పొందినట్లు, ఈ ఏడాది కూడా మంచి దిగుబడి వచ్చిందని రైతు వివరించారు.
అనంతరం సీతారామపురం గ్రామంలో పాలెం యుగంధర్ రెడ్డి వేసిన షేడ్ నెట్ నర్సరీని సందర్శించిన కలెక్టర్ అరటి, మిరప, చామంతి టిష్యూ కల్చర్ మొక్కలను పరిశీలించారు. ఈ నర్సరీ ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలకు నార్లు సరఫరా చేసి అధిక లాభాలు పొందుతున్నట్టు రైతు వివరించగా, ప్రభుత్వం సబ్సిడీతో అందించిన ఈ సదుపాయాన్ని ఉపయోగించి మంచి ఆదాయం పొందుతున్నానని కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తరువాత ఉద్యాన, పూల సాగు రైతులతో కలెక్టర్ ముఖాముఖి జరిపి వివరాలు తెలుసుకున్నారు. సీతారామపురం గ్రామంలో సుమారు 900 ఎకరాల్లో పూల సాగుతో పాటు అరటి, బత్తాయి, చామంతి, ఉల్లి, టమోటా పంటలను సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు అనుకూలమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. రైతు భూపాల్ రెడ్డి నాలుగు ఎకరాల్లో సాగుచేసిన అంజూరు పంటను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా సాగు చేస్తున్న "డయానా" రకం ద్వారా రూ.10 లక్షల ఆదాయం పొందుతున్నానని రైతు వివరించారు. ఈ రకం ఎండు అంజూరుకు అనుకూలమని, ఇందుకోసం ఏర్పాటు చేసిన డ్రై యూనిట్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు.
ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యాక్ హౌస్‌ను సందర్శించిన కలెక్టర్, అనంతరం రైతు రామేశ్వర్ రెడ్డి వేసిన చామంతి పంటను పరిశీలించారు. సెంటెడ్ ఎల్లో, పేపర్ ఎల్లో, బుల్లెట్ రకాలను సాగు చేస్తున్న రైతును అభినందిస్తూ, పూల సాగు ద్వారా లాభాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు, అవగాహన కార్యక్రమాలు అందించాలని ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక దిగుబడి ఇచ్చే పంటల ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఆమె ఉటంకించారు.

# వైభవంగా జనసేన నాయకులు

# దండు మురళీకృష్ణ జన్మదిన వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
నంద్యాల పట్టణంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు దండు మురళి కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈరోజు నంద్యాల జనసేన నాయకులు మరాచు గురు బాబు, నందికొట్కూరు జనసేన నాయకులు రాము,ఆధ్వర్యంలో మురళి స్వగృహం నందు నంద్యాల జిల్లా జనసేననాయకులు,అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన దండు మురళీకృష్ణ కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మరాచు గురుబాబు,మాట్లాడుతూ.. దండు మురళి కృష్ణ జనసేన పార్టీలో ఒక కమిట్మెంట్ ఉన్న నాయకుడని మన సొసైటీలో కుల,మత రాజకీయ పార్టీలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలు చేయడం ఉండటం మనం చేసుకున్న అదృష్టం అంటూ ప్రశంసలు కురిపించారు. అనంతరం నందికొట్కూరు జనసేన రాము మాట్లాడుతూ దండు మురళీకృష్ణ లాంటి నాయకుడు జనసేన పార్టీలో ఉండడం మనం చేసుకున్న అదృష్టమని రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఆయన్ను అభినందించారు.ఎవరైనా తెలిసిన వారికి మాత్రమే అండగా నిలబడతామని కానీ మన జనసేన దండు మురళి కృష్ణ సాయం అని తన గడప తొక్కిన ప్రతి ఒక్కరికి లేదనకుండా సాయం చేయడం దండు మురళీకృష్ణ కే చెల్లిందని అటువంటి వారి రాబోయే కాలంలో జనసేన పార్టీలో ఉన్నతమైన పదవులు చేపట్టాలని అలాగే నంద్యాల జిల్లాలో దండు మురళి కృష్ణ లాంటి నాయకుడు ఈ నంద్యాల జిల్లాలో ఉండడం జన సైనికులు, వీర మహిళలు, అదృష్టంగా భావించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మరాచు గురు బాబు,నాగివెంకటేశ్వర్లు,బననాపల్లె సమన్వయకర్త సురేష్,నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు జనసేన రాము, రమణ, సూర్య బాబు,చందు బద్రి, పవన్,శనగల కిషోర్ నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలి.

### ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి.

### అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి 3000 ఇవ్వాలని తీర్మానం చేయాలి.

### డిఆర్ఓ రామ్ నాయక్ కు వినతిపత్రం ఇచ్చిన ఏఐవైఎఫ్ నాయకులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగ రాముడు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో పోస్టులు భర్తీ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని అలాగే నిరుద్యోగ భృతి 3000 రక్షణమే ఇచ్చేందుకు అసెంబ్లీ సమావేశాలు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఎన్నికల హామీలలో భాగంగా ఉద్యోగాలు ఇవ్వనటువంటి పక్షంలో నిరుద్యోగ భృతి 3000 తక్షణమే చెల్లించాలని, అమరావతి రాజధాని ప్రాంతాన్ని తక్షణమే ఫ్రీజోన్ గా ప్రకటించాలని, స్థానికంగా మరియు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేటటువంటి పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు 70% ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్ లెక్చరర్ టీచింగ్ నాన్ టీచింగ్ మరియు లైబ్రరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లో భర్తీ చేయాలని, వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలని వాలంటీర్లలో విద్యార్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో భర్తీకి అవకాశం కల్పించాలని, పేద నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిలను అందుబాటులోకి తెచ్చి ఉచితంగా మెటీరియల్స్ పంపిణీ చేసి వారి భవిష్యత్తు గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలని, ఈ డిమాండ్ల అన్నింటి పైన ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు ఉదయ్ శ్రీను శంకర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజ మాతంగి దేవి అలంకారంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణం లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ రాజ మాతంగి దేవి అలంకారంలో కనువిందు చేసింది.పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో లో దసరా శరన్నవరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భవనాసి కుటుంబసభ్యులు వాసు,మహేష్ లు అమ్మవారికి పట్టు చీరే సమర్పించారు.అమ్మవారికి ప్రత్యేక పూలతో చేసిన అలంకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సాయంత్రం గ్రామోత్సవం లో శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చింది.అమ్మవారు సర్వాలంకారలతో దేవస్థానం నుంచి బయలుదేరి మెయిన్ బజార్,పోస్ట్ ఆఫీస్,పార్క్ రోడ్డు,మహానందీశ్వర స్వామి దేవస్థానం,పార్కు రోడ్డు,గాంధీ చౌక్ మీదుగా పుర విధుల్లో అమ్మవారికి దర్శనం ఇచ్చింది.ప్రజలు,మహిళలు,భక్తులు పెద్ద సామీ అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఆర్యవైశ్యుల ఇలవేల్పు వివిధ రూపాల్లో కనిపించడంతో భక్తి పారవశ్యంతో కనులారా చూసి ఆనందించారు. ది రిటైల్ మర్చంట్ అసోసియేషన్,గ్రామోత్సవ కమిటి, శ్రీ వాసవీ దీక్షా మండలి,వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ గ్రామోత్సవం లో అడ్డగాళ్ల మధుసూదన రావు,తాడు వాయి వెంకట నారాయణ,మంచికంటి కృష్ణా రావు,అచ్యుత సుధాకర్,మిరియాల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి దేవి కి ప్రత్యేక పూజలు చేసిన జనసేన నాయకులు.

## నంద్యాల జనసేన నాయకులు దండు మురళి కృష్ణ, మరాచు గురు బాబు,రాము.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**నంద్యాల పట్టణంలోని ఉప్పరిపేట చెందిన అనిల్ వారి ఆహ్వానం మేరకు కాలనీలో వెలసిన శ్రీ గాయత్రి దేవి మండపం నందు దసరా నవరాత్రులలో భాగంగా గాయత్రి దేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల నిర్వహించిన జనసేన నాయకులు దండం మురళి కృష్ణ, మరాచు గురు బాబు, రాము, దినేష్ ,రెండవ రోజు సందర్భంగా దసరా నవరాత్రులలో భాగంగా గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన మండపం నందు అర్చకులు గాయత్రి అమ్మవారి పంచామృత, అభిషేకం జనసేన నాయకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దండు మురళి కృష్ణ, మరాచు గురు బాబు, రాము, దినేష్ పవన్, అనిల్, రమణ తదితరులు పాల్గొని గాయత్రీ దేవిని దర్శించుకున్నారు.

# రేషన్ పంపిణీలో విప్లవాత్మక మార్పు..

### నంద్యాలలో కొత్త ఈ-పాస్ మిషన్లు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 23:**
నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఘనంగా కార్యక్రమం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, చేతుల మీదుగా జిల్లాలోని 1204 మంది చౌక ధరల దుకాణదారులకు పాత ఈ%-%పాస్ మిషన్ల స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త ఈ%-%పాస్ మిషన్లను పంపిణీ చేశారు.ఈ కొత్త మిషన్లు ఆండ్రాయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారంగా రూపొందించబడి, ఆధార్ బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్‌ఫేస్, అధిక డేటా ప్రాసెసింగ్ సామర్థ్యాలతో అందుబాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సమయస్ఫూర్తి, ఖచ్చితమైన సేవలందించడంలో ఈ ఆధునిక మిషన్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్డుదారులు రేషన్ బియ్యం పొందే సమయంలో ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా నిత్యావసర సరుకులు పొందడం వలన అవినీతి, మానవీయ లోపాలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అన్నారు. అలాగే పిడిఎస్ స్టాక్ నిల్వల నిర్వహణ మెరుగై ప్రతి లావాదేవీ రియల్ టైమ్‌లో నమోదు అవుతుందని చెప్పారు. ఈ టెక్నాలజీ వలన కార్డుదారుల సంతృప్తి పెరిగి, ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జె. రవిబాబు, ఉప తహశీల్దార్లు కే ఎల్ వి. ప్రసాదరావు, ఎం వి ఎస్ ఎస్ శేఖర్ రెడ్డి, బీవీ. నాగేశ్వర రెడ్డి, సి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 24 సెప్టెంబర్ 2025

# మద్దిలేటి రంగస్వామి దేవాలయంలో మౌలిక వసతులపై కలెక్టర్ పరిశీలన.







**ఆంధ్ర ప్రగతి బేతంచర్ల/నంద్యాల, సెప్టెంబర్ 23:** బేతంచెర్ల మండలంలోని ప్రసిద్ధ మద్దిలేటి రంగస్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి మంగళవారం సందర్శించారు. భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వచ్చిన అభిప్రాయాల నేపథ్యంలో కలెక్టర్ దేవస్థానం ఈఓ రామాంజనేయులు నుండి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గదులు, త్రాగునీటి సదుపాయం, పార్కింగ్ ప్రదేశాలు, పారిశుధ్య నిర్వహణ, క్యూ లైన్ దర్శనాలు, ప్రసాదాల పంపిణీ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి విభాగంలోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈఓను కలెక్టర్ ఆదేశించారు. దేవాలయం పరిధిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 40 టాయిలెట్లు, సహాయక కేంద్రం, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక వసతులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. పొలం రస్తా వివాదంపై కలెక్టర్ విచారణ. అదే రోజు కలెక్టర్ బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన రైతు మధు శేఖర్ గౌడ్‌కు సంబంధించిన పొలం రస్తా వివాదంపై కూడా విచారణ జరిపారు. సర్వే నెంబర్ 961/బి2లో ఉన్న 7.62 ఎకరాల పొలం వెనుక భాగంలో ఉన్న మరో పొలానికి వెళ్లేందుకు రస్తా సమస్య తలెత్తడంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ అంశంపై కలెక్టర్ ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సమస్యను 15 రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి డోన్ ఆర్డిఓ నరసింహులు, బేతంచెర్ల తహశీల్దార్ నాగమణిలు ఇరుపక్షాల నుండి నివేదికలు సేకరించి సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



## మెడికల్ రంగంలో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

**రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని గంటల విధానాన్ని రద్దు చేయాలి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** నంద్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగ్గట్టు వే తనం ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వము ఎనిమిది గంటల పని విధానాన్ని ఎత్తివేసి 13 గంటల పని విధానాన్ని ఏర్పాటు చేయాలని జీవో అమలు చేయడం దుర్మార్గమని వెంటనే వాటిని రద్దు చేయాలని ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.సుశీలమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వము ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 13 గంటల పని విధానాన్ని చేయడము కార్మిక వ్యతిరేక చర్యని నంద్యాల జిల్లా కేంద్రంలో వందలాదిమంది మెడికల్ రంగంలో కాంట్రాక్టర్ కానీ కార్మికులు పనిచేస్తున్నారని వారికి కనీస సౌకర్యాలు కనీస ఉద్యోగత భద్రత కల్పించడంలో ప్రభుత్వ అధికారులు వైఫల్యం చెందారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వము 13 పరివిధానని ఎత్తివేసి కాంటాక్ట్ ఉద్యోగులకు పని భద్రత కల్పించే చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించేస్తుంది పై నాయకులు హెచ్చరించారు.

## అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడల్లో నంద్యాల కిరీటం

## పబ్బతి చిన్మయి శ్రేయకు అభినందనలు.

**అభినందించిన డాక్టర్ ఎస్ ఎం డి నౌమన్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:** ఉత్తరాఖండ్‌లో ఇటీవల నిర్వహించబడిన అండర్-17 ఫెన్సింగ్ పోటీలలో విశేష ప్రతిభను ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అర్హత పొందిన నంద్యాల యువ క్రీడాకారిణి పబ్బతి చిన్మయి శ్రేయ రాయలసీమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ప్రముఖ బిల్డర్ పబ్బతి వేణు కుమార్తె అయిన శ్రేయ తన అచంచలమైన పట్టుదల, కృషి మరియు క్రీడాపై గల తపనతో రాష్ట్రస్థాయిలో మెరిసి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ అండర్-17 ఫెన్సింగ్ పోటీలకు రాయలసీమ నుంచి ప్రథమసారి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణిగా చిన్మయి శ్రేయ చరిత్రలో నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎండి నౌమాన్ ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ ఇలా అన్నారు. పబ్బతి చిన్మయి శ్రేయ సాధించిన విజయంతో నంద్యాల ప్రతిష్ట మరింత పెరిగింది. ఇలాంటి యువ ప్రతిభావంతులు భవిష్యత్‌లో మరిన్ని మైలురాళ్లను చేరాలని, వారి తల్లిదండ్రుల కీర్తిని దేశ విదేశాలలో చాటాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. ఆయన చేతుల మీదుగా చిన్మయి శ్రేయకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ శేఖర్ రెడ్డి, అలాగే కౌన్సిలర్లు తమీమ్, చంద్రశేఖర్ రెడ్డి, పార్థుడు, ఆటోనగర్ మాజీ ప్రెసిడెంట్ కోహినూర్ మబాషా, రాయలసీమ చంద్, యూనుస్, నూర్, హుమాయున్ పలుగురు పాల్గొని శ్రేయను అభినందించారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

**- డా కె.వేణుగోపాల్, సీఈఓ సెట్కూరు.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు సెప్టెంబర్ 23:** జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మత్తుపదార్థాలు వ్యసనం - పర్యవసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్కూరు సీఈఓ డా!! కె.వేణుగోపాల్ మాట్లాడుతూ.. నేటి యువతకు సిగరెట్, బీర్ త్రాగడం అనేది ఒక ఫ్యాషన్ అయిపోయిందని, ఈ విధంగా చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు అలవాటు పడితే తమ ఆరోగ్యం చెడిపోవడమే కాక తమ బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని, గంపెడు ఆశలు పెట్టుకున్న వారి తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగులుస్తున్నారని తెలిపారు.
మాదక ద్రవ్యాలు మనిషిని మానసికంగా, శారీరకంగా పూర్తిగా లోబర్చుకొని, మనిషి ప్రవర్తనను, నడవడికను మార్చి భవిష్యత్తును పూర్తిఅంధకారం చేస్తాయని వీటిని కొనటానికి నేరాలు చేయడానికి కూడా యువత వెనుకాడడం లేదని డ్రగ్స్ వినియోగం లేదా సరఫరా చేస్తూ దొరికితే 10 సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని తెలిపారు. మీ పరిసరాలలో మత్తు పదార్థాల అమ్మడం జరిగిన, తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి నివారణకు ఈగల్ అనే ప్రత్యేక పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేసి మత్తుపదార్థాల నివారణకు కృషి చేస్తున్నాయని తెలిపారు.
కళాశాల ప్రిన్సిపాల్ సి.సుంకన్న మాట్లాడుతూ యువత చదువుకొనే వయసులో దురలవాట్లకు దూరంగా ఉండాలని, అలాగే ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టా గ్రామ్ మొదలగువాటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్రీ శ్యాం బాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి.

**ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం. -మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి.**

**కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి.**

**ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 23:** జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలతో త్రాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ...నంద్యాల జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేసి ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు రోడ్ల పైన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్త కుప్పలు, పేడ దిబ్బలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ అధికారులు సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండా స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలన్నారు. ఈవోపీఆర్డీలు పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రత వల్ల అంటువ్యాధులతోపాటు అనేక రకాలైన వ్యాధులను నివారించవచ్చని, అలాగే దోమల నివారణ సాధ్యపడుతుందని, దోమల వల్ల వచ్చే వ్యాధులను కూడా అరికట్ట వచ్చునని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.
నంద్యాల జిల్లాకు మంజూరైన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈలకు సూచించారు. ముఖ్యంగా హాస్టల్లలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా ప్రతి అంశంలో మన జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు ప్రతి అధికారి తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వివిధ అంశాలపై అధికారులకు విసి ద్వారా కూలంకుషంగా వివరించారు.

# గురు రాజా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..!

గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధ్యాపక బృందానికి క్రికెట్ పోటీలు.

ట్రోఫీని ఆవిష్కరించిన డాక్టర్ రవి కృష్ణ, మౌలాలి రెడ్డి.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీల నిర్వహణ పునరుత్తేజాన్ని ఇస్తాయి: డాక్టర్ రవి కృష్ణ.



గురు రాజా ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవి కృష్ణ ,మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి.



బ్యాటింగ్ చేస్తున్న మౌలాలి రెడ్డి.



బ్యాటింగ్ చేసి మ్యాచ్ ప్రారంభిస్తున్న నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**

శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధ్యాపక బృందానికి దసరా సెలవులలో గురు రాజా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు, శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా విజేత జట్టుకు, రన్నర్స్ జట్టుకు, వ్యక్తిగత ప్రతిభకు అందించే ట్రోఫీలు నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, మౌలాలి రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులకు బోధిస్తూ, పాఠ్యాంశాలు వివరించడానికి సమాయత్తమవుతూ వృత్తిలో నిమగ్నమైన వారికి ఆటవిడుపుగా క్రీడలు ఏర్పాటు చేయడం ద్వారా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఆస్కారం ఏర్పడుతుందని,తద్వారా పునరుత్తేజంతో తమ వృత్తి బాధ్యతలు నెరవేర్చడంలో కృషి చేయడానికి దోహదం చేస్తుందని అన్నారు.

టైటాన్స్,లెజెండ్స్,వారియర్స్ పేర్లతో మూడు జట్లుగా ఏర్పడి క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలతో పాటు వ్యక్తిగత ప్రతిభకు నగదు పారితోషికాలు ముగింపు ఉత్సవంలో ఇవ్వడం జరుగుతుందని శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలియజేశారు.

తదుపరి డాక్టర్ రవి కృష్ణ, మౌలాలి రెడ్డి కొద్దిసేపు బ్యాటింగ్ చేసి మ్యాచ్ ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మనోహర్ రెడ్డి,శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితునికి ఆపన్న హస్తం..

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎన్ఎండి ఫిరోజ్.

**1,20,876/- రుపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం ఆర్ ఎఫ్ చెక్కును బాధితుని ఇంటికి వెళ్లి అందజేసిన ఎన్ ఎండి.ఫిరోజ్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఎన్ ఎండి ఫరూక్ సహకారంతో మంజూరైన ?1,20,876/- అక్షరాల ఒక లక్ష ఇరవై వేల ఎనిమిది వందల డెబ్బై ఆరు రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును నంద్యాల పట్టణం 39వ వార్డు అంజుమన్ వీధికు చెందిన సయ్యద్ ఇమామ్ కు కిడ్నీ సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ కష్ట సమయంలో ఎన్ ఎండి ఫిరోజ్ వారిని ఆసుపత్రి నందు సందర్శించి వారి ఆసుపత్రి ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. సయ్యద్ ఇమామ్ కోలుకున్న తర్వాత ఇచ్చిన మాటను నిజం చేస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన మొత్తాన్ని వారి స్వగృహానికి చేరుకొని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారి చేతులకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ అందజేశారు.కోమాలోకి వెళ్లడంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకొని ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎన్ ఎండి ఫిరోజ్ తమ ఇంటికి వచ్చి మరి ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కును అందజేసినందుకు వారికీ ముఖ్యమంత్రి చంద్రబాబు కు మంత్రి ఎన్ ఎండి ఫరూక్ కు సయ్యద్ ఇమామ్ మరియు వారి సతీమణి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్,వార్డు టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
నంద్యాల నియోజకవర్గంలో మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రజలు ఆపద సమయాల్లో అందించే మెడికల్ రీయంబర్స్మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు మంగళవారం నాడు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 20 మంది లబ్ధిదారులకు 15 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా 15 లక్షల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల టౌన్, నంద్యాల మండలం మరియు గోస్పాడు మండల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు నారా లోకేష్, ఎన్ఎండి ఫరూక్ లతో పాటు ఫిరోజ్, ఫయాజ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, కామిని మల్లికార్జున, చిన్నంశెట్టి శ్రీనివాసులు, షేక్ మున్న , గోవిందు నాయుడు మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోవడం బాధాకరం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
అగ్రిగోల్డ్ డబ్బులు కట్టి నష్టపోయిన బాధితులకు ఇప్పటివరకు ప్రభుత్వం న్యాయం చేయకపోవడం విచారకరమని ముస్లిం హక్కుల పోరాట సమితి కర్నూల్ నంద్యాల ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ ఉమ్మడి జిల్లాల జిల్లా అధ్యక్షులు కరాటే మా భాష విమర్శించారు. లక్షలాదిమంది ఖాతాదారులకు చెల్లించవలసి ఉన్న సొమ్మును చెల్లించడంలో విఫలమైన అగ్రిగోల్డ్ సమస్త పై న్యాయం కోసం పోరాడుతున్న బాధితులకు న్యాయం చేసేందుకు అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన దాదాపు 390 ఆస్తులను విక్రయించి బాధితులకు వారి సొమ్ము అందించ వలసిందిగా న్యాయస్థానం ఈడి ను ఆదేశించి మూడు నెలలు దాటిన దీనిపై బాధితులకు ఎంతవరకు ఎటువంటి లబ్ధి చేకూరాలేదని ముస్లిం హక్కుల పోరాట సమితి నంద్యాల కర్నూలు ఉమ్మడి జిల్లాల గౌరవ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కరాటే మా భాష అన్నారు. ఆస్తుల విక్రయం కొరకు రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి కమిటీలను ఏర్పరచి ఆయా కమిటీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విక్రయించి బాధితులకు న్యాయం చేయవలసి ఉండగా, కొన్ని లక్షల మంది వేలకోట్ల రూపాయలు దశాబ్ద కాలంగా అందక అనేక విధాలుగా ఇబ్బందులు పడి, పోరాటాలు చేసిన, చివరికి న్యాయస్థానం ఆదేశించిన ఇంతవరకు ఎటువంటి ప్రయోజనం లబ్ధిదారులకు చేకూరలేదు ఉచిత పథకాలపై ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధలో కొంత భాగం కష్టపడిన సొమ్మును ఇవ్వవలసిందిగా కోరుతున్న అగ్రిగోల్డ్ బాధితులపై చూపి, లక్షలాది బాధ్యత కుటుంబాలకు త్వరితంగా వారి సొమ్మును అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సయ్యద్ ఇక్బాల్, కరాటే మా భాష డిమాండ్ చేశారు.

# మైనారిటీలకు, బీసీ లకు బడ్జెట్ లేకుండా చేసింది ఎవరు..!

**బడ్జెట్ ను నాశనం చేసింది మీరే..!!**

**ఐదేళ్లలో మైనారిటీలకు ఒక్క రూపాయి కూడా రుణాలు ఇవ్వనివారు ప్రశ్నించడమా..!**

**శాసనమండలిలో వైసిపి ఎమ్మెల్సీలకు చురకలంటించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**మైనారిటీ సంక్షేమ పథకాలకు ఆద్యులు ఎన్టీఆర్,చంద్రబాబు.**

**ఇమాములు, మౌజన్ లకు గౌరవ వేతనాలు ప్రవేశ పెట్టిన ఘనత చంద్రబాబుదే.**

**శాసనమండలి సమావేశంలో మంత్రి ఫరూక్ స్పష్టీకరణ.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబరు 23:**
“మైనారిటీలకు, బీసీ లకు బడ్జెట్ లేకుండా చేసిందెవరు.. బడ్జెట్ లేకుండా సంక్షేమ కార్యక్రమాల్లో కలిపేసింది మీరు..బడ్జెట్ ను నాశనం చేసింది మీరు” అంటూ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శాసనమండలిలో వైసిపి ఎమ్మెల్సీలకు తనదైన శైలిలో చురకలంటించారు. మంగళవారం జరిగిన శాసనమండలి సమావేశంలో వైసిపి ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మైనారిటీల కు సంబంధించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు,ఉర్దూ అకాడమీ తదితర అంశాలకు సంబంధించి ప్రశ్నలు లేవనెత్తారు.వైసిపి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఘాటుగా సమాధానం ఇస్తూ, ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం లో మైనారిటీలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ చురకలంటించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమని, ఎన్టీఆర్, చంద్రబాబుల తోనే మైనారిటీల సంక్షేమానికి పునాదులు పడ్డాయని మంత్రి ఫరూక్ అన్నారు. అప్పటి వరకు మైనారిటీలకు ఒక్క రూపాయి ఏమైనా ఉన్నదా..? బడ్జెట్ ఏమైనా కేటాయించారా..? ఇమాములు, మౌజన్లకు గౌరవ వేతనాలు ప్రవేశపెట్టిందే చంద్రబాబు..! మీరేమైనా పెట్టారా..? రూపాయి ఇచ్చారా..? అంటూ వైసిపి ఎమ్మెల్సీ లపై మంత్రి ఫరూక్ విరుచుకుపడ్డారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2014-19 లో 86,332 మంది కి రుణ సాయం అందించడం జరిగిందని, 2019-2024 మధ్య ఐదేళ్లలో మైనారిటీ లబ్ధిదారులకు రూపాయి కూడా ఇవ్వలేదని.. ఇది రికార్డెడ్.. కావాలంటే మీకు పంపిస్తా.. చూడండి అంటూ వైసీపీ సభ్యులకు అధికారిక లెక్కల పత్రాలను చూపిస్తూ మంత్రి ఫరూక్ చురకలాంటించారు.వక్ఫ్ బోర్డును వేయడం జరిగిందని, సెంట్రల్ యాక్ట్ వచ్చినా వక్ఫ్ బోర్డును చంద్రబాబు ధైర్యంగా వేశారని, దేశంలో ఎవరూ వెయ్యలేదని, వక్ఫ్ బోర్డును స్ట్రీమ్ లైన్ చేసిందే మేము.. ఇమాములు,మౌజనులు, పాస్టర్లకు గౌరవ వేతనాలు ఇచ్చాం.. ఇవన్నీ మేమే చేశాం.. మీరేమైనా చేశారా..?? వాస్తవాలను గుర్తించాలని వైసిపి ఎమ్మెల్సీలను ఉద్దేశించి మైనారిటీ మంత్రి ఫరూక్ ఘాటుగా హితవు పలికారు.ప్రస్తుత ఏడాదిలో 86,000 కు పైగా దరఖాస్తులు రుణాల కోసం వచ్చాయని,19,790 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించడం జరిగిందని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అందరికీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

# ఆయుర్వేదం సనాతన జీవనవిధానం లో భాగం.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 23:**
విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని భగీరథ సదన్ లో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 180 మంది నంద్యాల మరియు పరిసర ప్రాంత ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్యుల నుండి తగు సూచనలతో పాటు ఉచిత మందులు కూడా పొందారు.ముఖ్య అతిథులుగా డా: జి.రామకృష్ణా రెడ్డి మరియు పబ్బతి వేణుగోపాల్ లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం చేశారు.విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర సేవా విభాగం ప్రముఖ్ డా” పోలూరు రామ్మూర్తి ముఖ్య వక్త గా పాల్గొని ఆయుర్వేద వైద్యం యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం జిల్లా ప్రముఖు మోహన్ కిరణ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఆయుర్వేద వైద్యులు డా యశోధర, డా చిట్టిబొట్ల భరద్వాజ శర్మ , డా మధుసూదన శర్మ , డా అలిభాష, డా: ఐ.వి సుబ్రహ్మణ్యం, డా. శ్రీలక్ష్మి, డా బి. వెంకట కృష్ణ , డా ఈశ్వర్ , డా చందన, డా: శ్రావణ సంధ్య, డా సురేష్ బాబు తదితరులు పాల్గొని సేవలందించారు.

విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్ర మౌళీశ్వర రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రం విష్ణువర్ధన్ రెడ్డి , వై.ఎన్ రెడ్డి , పోలేపల్లి సందీప్, గోళ్ల సుదర్శనం, మదుసూదన రావు,సుహాసిని, చంద్ర శేఖర్, శేష సాయి, శ్రీకాంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# మావోయిస్ట్ పార్టీలో గందరగోళం

**మల్లోజుల లేఖపై పార్టీలో అసహనం**

**పార్టీకి సంబంధం లేదని వెల్లడి**

**వేణుగోపాల్‌ను ఉద్యమద్రోహిగా ప్రకటన**

**ఆయుధాలు సరెండర్ చేయాలని ఆదేశం**



ఖమ్మం **సెప్టెంబర్ 23 ఆంధ్ర ప్రగతి** మావోయిస్ట్ పార్టీలో గందరగోళం నెలకొంది. అగ్రేతలు ఒక్కొక్కరే నేలకు ఒరుగుతున్నారు. పటిష్ట నాయకత్వం లేకుండా పోయింది. దీనికితోడు కోవర్ట్ ఆపరేషన్లు పార్టీ ఉనికినే దెబ్బతీస్తున్నాయి. మరోవైపు వరుస ఎన్÷–కౌంటర్లు పార్టీని తుడిచి పెట్టేలా చేస్తోంది. ఆపరేషన్ కగార్‌తో నేతలను మట్టుబెడుతున్నారు. రిక్రూట్‌మెంట్ కూడా పూర్తిగా ఆగిపోయింది. ఈ క్రమంలో సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని మావోయిస్టు సీనియర్
నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. దీంతో తేరుకున్న మావోయిస్టులు అది పార్టీ విధానం కాదని ప్రకటించింది. ఆయనను ఉద్యమద్రోహిగా ప్రకటించింది. మల్లోజులపై మావోయిస్టు కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. అతడిని ద్రోహిగా ప్రకటించడంతోపాటు–, ఆయన వద్ద ఉన్న ఆయుధాలను వెంటనే పార్టీకి అప్పగించాలని ఆదేశించింది. లేనట్లయితే వాటిని పీపుల్స్ గొరిల్లా ఆర్మీ స్వాధీనం చేసుకుంటు–ందని హెచ్చరించింది. ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నా మంటూ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి హోదాలో అభయ్ పేరుతో మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల లేఖ విడుదల చేసిన క్రమంలో పార్టీలో గందరగోళం ఉందని అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రకటనను తప్పుబట్టిన కేంద్ర కమిటీ, పార్టీపై మల్లోజుల వేణుగోపాల్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. కాల్పుల విరమణ, శాంతి చర్చలపై అతడి ప్రకటనను ఖండించింది. లొంగిపోయేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొంది. మావోయిస్టు నేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీకి వేణుగోపాలరావు తమ్ముడు అవుతారు. మారిన ప్రపంచ, దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతి లో చేరాలని ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి, సీనియర్ పోలీస్ అధికారులు నిరం తరం చేసిన అభ్యర్థనల దృష్ట్యా తమ పార్టీ ఆయుధాలను వదులు కోవాలని నిర్ణయించుకుంటు–న్నదని ఆ పార్టీ నేత అభయ్ పేరుతో ఈ నెల 16న ఒక లేఖ విడుదలైన విషయం తెలిసిందే. సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని అందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పై అన్ని రాజకీయ పార్టీలు, పోరాడుతున్న సంస్థలతో వీలైనంత వరకు కలిసి పోరాడుతామని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ మంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు– తెలిపారు. మారిన తమ పార్టీ అభిప్రాయం గురించి పార్టీకి తెలియజేయడం తమ బాధ్యత అని, పార్టీలో ఈ అంశాన్ని అంగీకరించేవారు లేదా వ్యతిరేకించేవారు చర్చల్లో అంగీకరించి పాల్గొనే సహచరుల నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రస్తుతం తమతో అందుబాటులో ఉన్న పరిమిత క్యాడర్, కొంతమంది నాయకత్వ సహచరులు ఈ కొత్త విధానాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు– తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సహచరులతో, జైల్లో ఉన్న సభ్యులతో సంప్రదించేందుకు నెలరోజుల గడువు ఇస్తూ 'సీజ్ ఫైర్' చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునేందుకు కూడా తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు– తెలిపారు. అయితే, మావోయిస్టు పార్టీలో మారిన ఈ విధానం సంచలం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్ బసవరాజు మృతి తరువాత ఇటీవల కొత్త నాయకత్వంలో భాగంగా ఆయన స్థానంలో తిప్పిరి తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకున్న నేపథ్యం లో ఈ లేఖ విడుదల అవ్వడం మరింత సంచలనం కలిగిస్తున్నది. అంతేకాకుండా, ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు నేత ఫొటోతో ఆ పార్టీ లేఖను విడుదల చేయడం దేశంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చానీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ– ప్రతినిధి అభయ్ పేరుతో వచ్చిన ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి, మావోయిస్టు ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంశాఖ మంత్రులు శాంతిచర్చల పట్ల అనుకూలమైన వైఖరిని అవలంబించిన పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజల ముందు మావోయిస్టు పార్టీ తన మారిన వైఖరిని స్పష్టంచేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి విజ్ఞప్తి చేస్తున్నట్టు– మావోయిస్టు పార్టీ తెలిపింది. ఇదే ప్రతిపాదనపై మే 10న మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు– తాజా లేఖలోనూ మావోయిస్టులు తెలిపారు. అందులో తమ పార్టీ ఆయుధాలను వదులుకుంటు–న్నట్టు– ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వానికి కాల్పుల విరమణ సైతం ప్రతిపాదించినట్టు– వివరించారు. ఈ ముఖ్యమైన అంశంపై తమ పార్టీ నాయకత్వ, సహచరు లతో సంప్రదించడానికి ఒక నెల రోజుల సమయం కావాలని కోరుతున్నట్టు– పేర్కొన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోగా.. గత ఏడాది జనవరి నుంచి వేలాది సంఖ్యలో జరుపుతున్న సైనిక దాడిని తీవ్రతరం చేసింది. వేలాదిమంది సాయుధ పోలీస్ బలగాలను మోహరించి చుట్టుముట్టి నిర్మూలన దాడి జరిపింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మే 21న మాడ్ ఏరియాలోని గుండెకోట్ సమీపంలో జరిగిన భీకరదాడిలో ధైర్యంగా ప్రతిఘటించిన తమ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు– 28 మంది కేంద్ర కమిటీ– సభ్యులు, సహచరులు, వారి భద్రతా సిబ్బంది అమరులైనట్టు– పేర్కొన్నారు. గతంలో జరిగిన శాంతిచర్చల ప్రక్రియను సగంలో వదిలి వేయకుండా అభయ్ ఆలోచనలకు అనుగుణంగా శాంతి చర్చలను ముందుకు తీసుకువెళ్లాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు–, ఇందుకోసమే ఈ పత్రికా ప్రకటన విడుదల చేస్తున్నట్టు– వెల్లడించారు. తమ పార్టీ ప్రధాన కార్యదర్శి చొరవతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్టు– పేర్కొన్నారు. మొత్తంగా ఇప్పుడు మల్లోజుల వ్యవహారంతో మావోయిస్టుల్లో భేదాభిప్రాయాలు బట్టబయలు అయ్యాయి.

# ఢిల్లీలో 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానం








న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 23 ఆంధ్ర ప్రగతి**
భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలో వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజేతలు అవార్డులను అందుకున్నారు. ఈ ఏడాది జాతీయ వేదికపై తెలుగు సినిమా తన సత్తాను చాటింది. 'బేబి', 'బలగం', 'హనుమాన్' వంటి చిత్రాలు పలు కీలక విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలిచాయి.

విధు వినోద్ చోప్రా నిర్మించి, దర్శకత్వం వహించిన '12%ష్ట్ర% ఫెయిల్' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో అద్భుతమైన నటన కనబరిచినందుకు విక్రాంత్ మాస్సే, 'జవాన్' చిత్రానికి గాను షారుఖ్ ఖాన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్న రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు.

### తెలుగు సినిమాకు దక్కిన గౌరవం

ఈసారి తెలుగు సినిమా పలు విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. 'బేబి' చిత్రంలోని 'ప్రేమిస్తున్నా' పాటకు గాను పీవీఎన్ఎస్ రోహిత్ ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఎంపికయ్యారు. ఇదే చిత్రానికి సాయి రాజేష్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు గెలుచుకున్నారు. 'బలగం' సినిమాలోని 'ఊరు పల్లెటూరు' పాటకు కాసర్ల శ్యామ్ ఉత్తమ గీత రచయితగా జాతీయ పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. ఇక 'హనుమాన్' చిత్రానికి గాను జెట్టి వెంకట్ కుమార్ ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పురస్కారం అందుకున్నారు. 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి సుకృతి వేణి బండ్రెడ్డి ఉత్తమ బాలనటిగా ఎంపికయ్యారు.

**71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల పూర్తి జాబితా**

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12ఫెయిల్ (విధు వినోద్ చోప్రా)
ఉత్తమ నటుడు: షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాస్సే (12 ఫెయిల్)
ఉత్తమ నటి: రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)
ఉత్తమ వినోదాన్ని అందించిన ప్రజాదరణ పొందిన చిత్రం: రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ (కరణ్ జోహార్)
ఉత్తమ దర్శకత్వం: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)
ఉత్తమ సహాయ నటుడు: విజయరాఘవన్ (పూక్కాలం), ఎం. ఎస్. భాస్కర్ (పార్కింగ్)
ఉత్తమ సహాయ నటి: ఊర్వశి (ఉల్లొళుక్కు), జానకి బోడివాలా (వశ్)
ఉత్తమ నూతన దర్శకుడు: ఆశిష్ అవినాష్ బెండే (ఆత్మపాంప్లెట్)
ఉత్తమ బాలల చిత్రం: నాల్ 2
ఉత్తమ బాలనటులు: సుకృతి వేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు), కబీర్ ఖందారే (జిప్సీ), త్రీషా థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగతాప్ (నాల్ 2)
జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలతో కూడిన ఉత్తమ చిత్రం: సామ్ బహదూర్
ఉత్తమ నేపథ్య గాయకుడు: పీవీఎన్ఎస్ రోహిత్ (బేబి – ప్రేమిస్తున్నా)
ఉత్తమ నేపథ్య గాయని: శిల్పా రావు (జవాన్ – చలేయా)
ఉత్తమ గీత రచయిత: కాసర్ల శ్యామ్ (బలగం – ఊరు పల్లెటూరు)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ (%గాౄఎ+జ%): జెట్టి వెంకట్ కుమార్ (హను–మాన్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): సాయి రాజేష్ (బేబి), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్)
ఉత్తమ సంభాషణలు: దీపక్ కింగ్రానీ (సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ప్రసంతను మహాపాత్ర (ది కేరళ స్టోరీ)
ఉత్తమ సౌండ్ డిజైన్: సచిన్ సుధాకరన్, హరిహరన్ మురళీధరన్ (యానిమల్)
ఉత్తమ ఎడిటింగ్: మిథున్ మురళి (పూక్కాలం)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: మోహన్‌దాస్ (2018)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: సచిన్ లోవలేకర్, దివ్య గంభీర్, నిధి గంభీర్ (సామ్ బహదూర్)
ఉత్తమ మేకప్: శ్రీకాంత్ దేశాయ్ (సామ్ బహదూర్)
ఉత్తమ కొరియోగ్రఫీ: వైభవి మర్చంట్ (రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ – ధిండోరా బాజే రే)
ఉత్తమ డాక్యుమెంటరీ: గాడ్ వల్చర్ అండ్ హ్యూమన్ (రిషిరాజ్ అగర్వాల్)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్: గిధ్ (ది స్కావెంజర్) (మనీష్ సైనీ)
ఉత్తమ సినీ విమర్శకుడు: ఉత్పల్ దత్తా
దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం: మోహన్ లాల్

# ట్రంప్ చర్యలతో ఇంటాబయటా విమర్శలు

**వీసా ఫీజుల పెంపుతో అమెరికాకు నష్టమే**

**కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 23 ఆంధ్ర ప్రగతి**
హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించడం ఒక ఎత్తయితే , దీనిపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రంప్ నిర్ణయంపై టెక్ కంపెనీలు సమాలోచనలు చేస్తున్నాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశిథరూర్ మాట్లాడుతూ...ట్రంప్ నిర్ణయాలు దేశీయ రాజకీయాలతో ముడిపడి ఉంటాయని అభిప్రయాపడ్డారు. హెచ్1బీ వీసాల కారణంగా ఎక్కువ జీతాలు తీసుకొనే అమెరికన్ల కంటే, తక్కువ జీతాలు తీసుకొనే భారతీయుల వైపే అక్కడి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ట్రంప్ ఆయన కార్యవర్గం భావిస్తోంది. అయితే, ఫీజు లక్ష డాలర్లకు పెంచితే తమకు కావాల్సిన, ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు మాత్రమే అమెరికాకు వస్తారని వారు అనుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనక ట్రంప్ లాజిక్ ఏంటో, ఇది నిజంగా వర్కౌట్ అవుతుందా అనేది నాకు అర్థం కావడం లేదు. దీంతో అనేక కంపెనీలు ఎక్కువ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇచ్చేస్తాయని శశిథరూర్ పేర్కొన్నారు. ఇక, భారత దిగుమతులపై ట్రంప్ పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంపైనా థరూర్ మాట్లాడారు. అనేక సమస్యల పరిష్కారానికి సుంకాలు అనేవి ఒక మాయా సాధనంగా ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ టారిఫ్‌ల నుంచి వచ్చే బిలియన్ డాలర్లతో యూఎస్‌లో నెలకొన్న లోటును పూడ్చాలనేది ఆయన ఉద్దేశమై ఉంటుందన్నారు. అయితే, భారత్‌పై సుంకాల విధింపుతో ఆయనకు ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారత్‌ను ఉద్దేశిస్తూ తరచూ ట్వీట్లు పెట్టడం, ఆయన సలహాదారుడు నవారో అభ్యంతరకర వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌కు కాస్త ఎదురుదెబ్బేనన్నారు. అయితే, ప్రస్తుతం వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని తాను భావిస్తున్నట్లు– తెలిపారు. ట్రంప్ కూడా పట్టుదలకు పోయి సాధించేదేమీ ఉండదన్నారు. చివరగా దేశంలోనే ఆయన విర్శలకు గురికాక తప్పదన్నారు.

# యూరియా కోసం తప్పని యాతన

**ప్రభుత్వ ప్రకటనలపై రైతుల మండిపాటు**



విజయవాడ **సెప్టెంబర్ 23 ఆంధ్ర ప్రగతి** ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యూరియా కొరత తీవ్రస్థాయిలో కనిపిస్తోంది. గతంలో ఎప్పుడు సహకార సంఘ కార్యాలయాలకు మహిళలతో సహా వెళ్లి యూరియా కావాలంటూ లైన్ లో నిలబడిన పరిస్థితులు అంతంత మాత్రమే. కానీ ఈ ఏడాది వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం ... అవసరానికి మించి అమ్మకాలు చేసినట్లు– చెబుతుండగా, మరోవైపు రైతులు మాత్రం యూరియా లేదంటూ ఆందోళన చేస్తున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. అసెంబ్లీలో సైతం మంత్రి అచ్చన్నాయుడు యూరియా కొరత లేదన్నారు. కావాలనే గందరగోళం సృష్టిస్తున్నారని చెప్పారు. కానీఈ పరిస్థితి మంగళవారం పలు గ్రామాల్లో నెలకొంది. రైతులు వేలల్లో ఉండగా, యూరియా కట్టలు మాత్రం వందల్లో సరఫరా జరిగింది. ఈ విషయమై అక్కడ వైసిపి నాయకులు మాట్లాడుతూ ... అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారని ఆగ్రహించారు. వాస్తవ పరిస్థితులు చూస్తే యూరియా అవసరమైన స్థాయిలో సరఫరా జరిగితే రైతులు ఎందుకు రోడెక్కుతారని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే ఎక్కడైనా యూరియా అంటూ ఆందోళన చేస్తుంటే కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వం ఆదేశిస్తుందంటూ, ఉమా ఆవేదన చెందారు. మొత్తం మీద మంగళవారం పెనుగోలను లో 25 టన్నులు, రాజవరం 5 టన్నులు, ఊటు–కూరు 16 టన్నులు యూరియా సరఫరా జరిగింది. ఈ విషయమై వ్యవసాయ అధికారి వల్లభనేని హరీష్ మాట్లాడుతూ ... గత ఏడాది కంటే ఈ ఏడాది మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎక్కువ యూరియాను సరఫరా చేసి రైతులకు అందజేసినట్లు– తెలిపారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు

**గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ**

**భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు**



విజయవాడ **సెప్టెంబర్ 23 ఆంధ్ర ప్రగతి** శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టానదేవత. ఆ తల్లి అధిష్టాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్న కాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని,. పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోజున ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తోంది.దేవీ నవరాత్రులలో రెండవ రోజు ఆశ్వయుజ శుక్ల తదియ నాడు కదంబవనవాసిని అయిన ఆ పరమేశ్వరి శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులతో పూజలను అందుకుంటుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ కనక దుర్గమ్మ నవరాత్రులలో రెండో రోజున చతుర్వేద స్వరూపమైన శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో కాషాయం రంగు లేదా కనకాంబరం చీర ధరించి అత్యంత సుందరంగా భక్తులకు దర్శనం ఇస్తుంది. ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవిగా దర్శనం ఇస్తున్న దుర్గమ్మ దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం అయ్యాయి. కాగా దసరా నవరాత్రులలో మొదటి రోజు భక్తజనం విశేషం గా తరలివచ్చారు. 60 వేల మందికి పైగా భక్తులు బాల త్రిపురసుందరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు పలు రకాల సేవల, దర్శన టికెట్ల రూపేణా రూ. 22 లక్షల 72 వేల 214 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ సిబ్బంది చెప్పారు.



# బాలీవుడ్‌లో బంపరాఫర్ కొట్టేసిన ఓజి యాక్టర్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వస్తున్న ఓజి సినిమాపై ఎంత హైప్ క్రియేట్ అయిందో చూస్తూనే ఉన్నాం. ఈ హైప్ వల్ల అందులో నటించిన ప్రతీ ఒక్కరూ చాలా ఫేమస్ అయిపోతున్నారు. అందులో భాగంగానే కోలీవుడ్ యాక్టర్ అర్జున్ దాస్ కూడా ఓజి సినిమాతో బాగా పాపులర్ అయ్యారు. ఓజి కంటే ముందు నుంచే అర్జున్ దాస్ గొప్ప నటుడు, ఆయనకు మంచి గుర్తింపు కూడా ఉంది.

ఖైదీ, మాస్టర్ మరియు పలు ఇతర సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ దాస్, ఇప్పుడు ఓజి లో ఓ కీలకపాత్ర చేస్తున్నారు. ఓజి ట్రైలర్ రిలీజైన దగ్గర నుంచి సినిమాలో అర్జున్ దాస్ క్యారెక్టర్ నెట్టింట వైరల్ అవుతుంది. ఓజి ట్రైలర్ తోనే అర్జున్ దాస్ విపరీతమైన క్రేజ్, ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. అందులో భాగంగానే ఇప్పుడాయనకు ఓ బాలీవుడ్ ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది.

అర్జున్ దాస్ కు బాలీవుడ్ ఆఫర్ రావడం నిజమే అయితే, ఆ సినిమానే ఈ టాలెంటెడ్ నటుడు చేసే మొదటి బాలీవుడ్ మూవీ కానుంది. బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం ప్రకారం ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రాబోతున్న డాన్3లో అర్జున్ దాస్ విలన్ గా నటించనున్నారని తెలుస్తోంది. డాన్3 కోసం ఫర్హాన్ ఇప్పటికే అర్జున్ దాస్ తో డిస్కషన్స్ కూడా మొదలుపెట్టారని, చిత్ర హీరో కూడా అర్జున్ ను సినిమాలోకి తీసుకోవడంపై ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారని అంటున్నారు.

డాన్3 లో ఫర్హాన్ అక్తర్ ఎక్కువ షేడ్స్ ఉన్న ఓ పాత్రను డిజైన్ చేయగా, దానికి అర్జున్ అయితే సరైన న్యాయం చేస్తారని అందరూ భావిస్తున్నారట. డాన్3లో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటిస్తుండటంతో, విలన్ గా అర్జున్ దాస్ నటిస్తే మాత్రం వీరిద్దరి మధ్య వార్ నెక్ట్స్ లెవెల్ లో ఉండటం ఖాయం. అర్జున్ దాస్ ఇప్పటివరకు ఎన్నో సినిమాలు చేసినప్పటికీ అతనికి ఓజి సినిమాతో వచ్చిన పాపులారిటీ, క్రేజ్ హాట్ టాపిక్ గా మారింది. అది కూడా కేవలం ట్రైలర్ తోనే ఈ రేంజ్ క్రేజ్ మాటలు కాదు మరి. మరి ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ ను అర్జున్ ఏ విధంగా వాడుకుంటారో చూడాలి.

# ఓజి ప్రియాంక కెరీర్ ను మలుపు తిప్పుతుందా?



హీరోయిన్లకు అందమొక్కటే సక్సెస్ ను అందించదు. ఆ సక్సెస్ కోసం ఎంతో కష్టపడాల్సి వస్తుంది. అందంతో పాటూ, తెలివి, నటన అన్నింటికంటే ముఖ్యమైనది సరైన కథలను ఎంపిక చేసుకోవడం. ఇవన్నీ సక్సెస్ కు మెయిన్ ఫార్ములాస్. ఈ ఫార్ములాస్ వల్లే ఎంతో మంది హీరోయిన్లు కెరీర్లో సూపర్ సక్సెస్ అవగా, మరికొందరు అందం, ప్రతిభ ఉండి కూడా వెనుకబడి పోతున్నారు. టాలెంట్ ఉన్నా సక్సెస్ రేట్ చాలా తక్కువ అందులో ప్రియాంక అరుళ్ మోహన్ ఒకరు. తన అందంతో ఎంతో మంది యూత్ ను ఎట్రాక్ట్ చేసి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ను ఏర్పరచుకున్నారు ప్రియాంక. ఆన్ స్క్రీన్ మాత్రమే కాకుండా ఆమె ఆఫ్ లైన్ లో కూడా ప్రియాంక ఉండే విధానం, ప్రవర్తించే తీరు చాలా మందిని మెప్పించి, ఆమెకు ఎక్కువ మందిని దగ్గరకు చేసింది. అయితే ఎంత అందమున్నా, ఫ్యాన్స్ ఉన్నా ప్రియాంకకు సక్సెస్ రేట్ చాలా తక్కువనేది ఒప్పుకోవాల్సిన వాస్తవం. మొదటి భారీ సినిమా ఓజినీ.. అలాంటి ప్రియాంకకు ఇప్పుడు ఓ భారీ అవకాశం ఓజి రూపంలో దక్కింది. ఇప్పటివరకు టాలీవుడ్ లో మిడ్ రేంజ్ సినిమాల్లోనే నటించిన ప్రియాంకకు ఓజి సినిమానే మొదటి భారీ బడ్జెట్ సినిమా. అందులోనూ ఆమె పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన జోడీగా నటించడమంటే ప్రియాంకకు అది గోల్డెన్ ఛాన్సే. ఓజిలో ఓజాస్ గంభీర భార్య కన్మణి పాత్రలో ప్రియాంక కనిపించనున్నారు. ఓజిలో కథను మలుపు తిప్పే పాత్రలో సినిమాలో ఆమె క్యారెక్టర్ నిడివి మరీ ఎక్కువగా ఉండకపోయినా సినిమాలో తన క్యారెక్టర్ చాలా కీలకమని ప్రియాంక మొదటి నుంచే చెప్పుకుంటూ వస్తున్నారు. పైగా ట్రైలర్ చూశాక ఆ విషయం నిజమని కూడా అర్థమైంది. సినిమాకు ఎంతో కీలకమైన ఫ్యామిలీ డ్రామాలో ప్రియాంక క్యారెక్టర్ కీలకంగా ఉంటుందని, తన క్యారెక్టరే సినిమాను మలుపు తిప్పుతుందని ఇప్పటికే ప్రియాంక చెప్పారు. అందుకే ఓజి సినిమా తన కెరీర్ ను మలుపు తిప్పే టర్నింగ్ పాయింట్ అవుతుందని ప్రియాంక ఈ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఓజి సినిమా హిట్టై తన క్యారెక్టర్ కు మంచి మార్కులు పడితే మాత్రం ప్రియాంకకు మరిన్ని స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్సులు దక్కే అవకాశముంది.



# సోషల్ మీడియా షేక్ చేస్తున్నరుక్మిణి..!

రుక్మిణి వసంత్ ప్రెజంట్ యూత్ ఆడియన్స్ కి ఒక క్రష్ గా మారింది. కన్నడలో సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఆడియన్స్ అందరికీ దగ్గరైంది. ఇప్పటికే తమిళ్ లో వరుస క్రేజీ ప్రాజెక్ట్ లు చేస్తున్న అమ్మడు మోస్ట్ హ్యాపెనింగ్ మూవీ కాంతారా ప్రీక్వెల్ లో ఛాన్స్ అందుకుంది. కాంతారా సినిమాకు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే.. ఆ క్రేజ్ ని మరింత పెంచేలా రుక్మిణి తోడవుతుంది. కాంతారా ప్రీక్వెల్ లో రుక్మిణి వసంత్ కనకావతి రోల్ లో నటిస్తుంది. మహారాణి గెటప్ లో రుక్మిణి పోస్టర్ రిలీజ్ తోనే సూపర్ అనేశారు. యూత్ ఆడియన్స్ లో క్రేజ్.. ఇక కాంతారా ప్రీక్వెల్ ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ కాగా అందులో రుక్మిణి సీన్స్ అయితే వేరే లెవెల్ అనేలా ఉన్నాయి. రుక్మిణి వసంత్ కనకావతి రోల్ లో వారెవా అనిపించేసింది. అసలే యూత్ ఆడియన్స్ లో ఆమె క్రేజ్ ఒక రేంజ్ లో ఉండగా కాంతారా ట్రైలర్ లోనే రుక్మిణి వసంత్ సీన్స్ ఇంప్రెస్ చేశాయి. కాంతారా లో ఆమెను తీసుకోవడానికి రీజనే ఆమెకు ఉన్న ఈ పాపులారిటీ వర్క్ అవుట్ అవుతుందని. జస్ట్ ట్రైలర్ రిలీజ్ అయ్యింది అంతే అందులో ఆమె షాట్స్ ని ఫోటోల రూపంలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఏ హీరోయిన్ కి రాని క్రేజ్ రుక్మిణి వసంత్ కి వచ్చింది. ఆమె క్యూట్ లుక్స్ ఇప్పటికే ఎంతోమంది హృదయాలను కొల్లగొడుతుంటే కాంతారా లో యువరాణి పాత్రలో ఆమె క్రేజీగా అనిపిస్తుంది. కాంతారా ప్రీక్వెల్ లో మెయిన్ హైలెట్స్ చాలా ఉన్నా కూడా వాటిలో రుక్మిణి వసంత్ కూడా ఒకటిగా మారేలా ఉన్నాయి. కాంతారా ప్రీక్వెల్ లో రుక్మిణి వన్ ఆఫ్ ది ఎట్రాక్టింగ్ పాయింట్ గా మారింది. ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ మూవీ.. తెలుగులో కూడా రుక్మిణికి సూపర్ క్రేజ్ ఏర్పడింది. అందుకే అమ్మడిని ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ మూవీకి ఓకే చేశారు. ఆల్రెడీ కోలీవుడ్ లో అమ్మడు విజయ్ సేతుపతి, కార్తికేయతో నటించింది. అక్కడ కూడా స్టార్ లీగ్ లోకి వెళ్లింది రుక్మిణి. తప్పకుండా రుక్మిణి వసంత్ సౌత్ నెంబర్ 1 హీరోయిన్ గా సత్తా చాటే ఛాన్స్ ఉంది. కాంతారా ప్రీక్వెల్ క్లిక్ అయితే రుక్మిణి రేసులో మరింత దూసుకెళ్లే ఛాన్స్ ఉంటుంది. కన్నడ భామలకు టాలీవుడ్ లక్కీ అని తెలిసిందే. సో రష్మిక తర్వాత రుక్మిణి కూడా టాలీవుడ్ టాప్ లేపే రేంజ్ లో ఛాన్స్ లు అందుకునేలా ఉంది.

# ఫ్యాన్స్‌కి 'మిరాయ్' కానుక..

## థియేటర్‌లో ఇక సందడే సందడి



తేజాసజ్జా, మంచు మనోజ్‌లు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిరాయ్' యాక్షన్, సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సెప్టెంబర్ 5వ తేదీన విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా 'వైబ్ ఉంది బేబి' అంటూ సాగే పాటను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాట కొంత యవతను విపరీతంగా ఆకట్టుకుంది. అయితే థియేటర్‌కి వెళ్లిన జనాలకు మాత్రం నిరాశే మిగిలింది. ఈ పాట లేకుండానే సినిమాను ప్రదర్శించారు. ఆసక్తికరంగా సాగే కథ, కథనాలకు ఈ పాట అడ్డు పడుతోందని తీసేసినట్లు దర్శకుడు కార్తీక్ తెలిపారు. అయితే పాట ఉంటే బాగుండేది అని ప్రేక్షకుల నుంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. దీంతో పాటను మళ్లీ చిత్రంతో జత చేస్తున్నారు. మంగళవారం నుంచి థియేటర్‌లో 'వైబ్' పాట సందడి మొదలువుతుంది. "చాట్‌బాస్టర్ వైబ్ సాంగ్‌ను నేటి నుంచి ప్రపంచవ్యాప్తంగా 'మిరాయ్' ప్రదర్శితమవుతున్న అన్ని షోలలోనూ యాడ్ చేస్తున్నాం" అని చిత్ర నిర్మాణ సంస్థ తెలిపింది. ఈ పాటకు గౌర హరి సంగీతం అందించగా.. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అర్మాన్ మాలిక్ ఈ పాట పాడారు.

# ప్రేక్షకులను బాగా నవ్వించే సినిమా'మిత్ర మండలి'




బన్నీ వాస్ నిర్మాణ సంస్థ బీవీ వర్క్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో వస్తున్న 'మిత్ర మండలి' చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్ ఎం., విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహారా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, వీటీవీ గణేష్ తదితరులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న 'మిత్ర మండలి' అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. టీజర్, కత్తందుకో జానకి, స్వేచ్ఛా స్టాండు పాటలకు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత.. 'మిత్ర మండలి' చిత్ర బృందం మూడో గీతం 'జంబర్ గింబర్ లాలా'ను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగిన ఈవెంట్‌లో ఈ పాటను ఆవిష్కరించింది. లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం చిత్ర బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ.. "ఈ సినిమాలో అందరూ కుర్రోళ్లే. అందుకే వీళ్లందరితో కలిసి నటించాలనే ఉద్దేశంతో ఈ సినిమా అంగీకరించాను. నాకు అత్యంత ఆప్తుడు బన్నీ వాసు.. బ్రహ్మానందం ఈ సినిమాలో ఎలాగైనా ఉండాలని, నన్ను తీసుకొచ్చాడు. అందరూ హాయిగా నవ్వుకునే సినిమా తీయాలనే గొప్ప ఆలోచన చేసిన నిర్మాతలు కళ్యాణ్, భాను, విజయేందర్ నా అభినందనలు"అని అన్నారు.

# గుడ్‌న్యూస్ చెప్పిన బాలీవుడ్ కపుల్.. తల్లి కాబోతున్న కత్రినా..



ముంబై: బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ శుభవార్త చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫోటోని అభిమానులతో పంచుకున్నారు. "ఆనందం, కృతజ్ఞతతో నిండిన హృదయాలతో మా జీవితంలోకి సరికొత్త, గొప్ప అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాము" అంటూ విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ కొంత సమయంలోనే వైరల్‌గా మారింది. సినీ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతున్నారు.